Visit us @ http://epaper.suryaa.com



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

గురువారం, 30 మే 2024 , పేజీలు: 04



# బాన్సువాడ లో నకిలీ ఐస్ క్రీం తయారీ.

## నకిలీ స్టికర్లతో విక్రయం

- మెయిన్ రోడ్ పక్కనే దర్జాగా సాగుతున్న దందా
- ఐస్ క్రీం డబ్బాలపై నో డేట్, నో ఎక్స్పైరీ, నో అడ్రెస్
- అనుమతులు లేకుండానే సాగుతున్న దందా
- ఏళ్ల తరబడి సాగుతున్న ఈ దందా అధికారులకు తెలుసా? లేక....!!!

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 29, సూర్య మేజర్ న్యూస్ :**

పిల్లలు ఐస్ క్రీమ్ అడగ్గానే కొనిస్తున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త. అసలే ఎండ కాలం. ఐస్ క్రీమ్స్ కి డిమాండ్ పెరిగింది. మండుటెండల్లో చల్ల చల్లని ఐస్ క్రీం తింటే ఆ మజనే వేరు. కానీ ఐస్ క్రీం ని కూడా కల్తీ చేస్తున్నారు. గంట గంట కి గల్లీలో సౌండ్ చేస్తూ తిరిగే బండ్లపై తీస్కొని ఐస్ క్రీం తింటే అంతే సంగతి. వివరాల్లోకి వెళ్తే బాన్సువాడ లో ఎలాంటి అనుమతి లేకుండా ఐస్ క్రీం తయారు చేస్తూ, తోపుడు బండ్లలో అమ్మేస్తూ చిన్న పిల్లల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు ఈ కేటుగాళ్ళు. (మిగతా 2వ పేజీలో)

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**సదాశివనగర్, మే 29, సూర్య మేజర్ న్యూస్ :**

సదాశివనగర్ మండలం ఉత్తునూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ సంజీవులు అమ్మ గంగమ్మ, వజ్జాపల్లి తండా మాజీ సర్పంచ్ అనిల్ అమ్మ సక్రి బాయ్ ఇటీవల మృతి చెందారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



- మంజీర నదిలో పడి ఇద్దరు మృతి
- సింగీతం అడవి ప్రాంతంలో అస్థిపంజరం లభ్యం

(మిగతా వివరాలు లోపల పేజీలో)



# పోలీసులకు సవాల్ గా మారిన వరుస దొంగతనాలు



- అయ్యపల్లిలో ఇంటి పై నుంచి దూకి దొంగతనం
- రంగంలోకి దిగిన క్లూస్ టీమ్

**లింగంపేట్, మే 29, సూర్య మేజర్ న్యూస్ :**

పోలీసులకు సవాల్ గా మారిన వరుస దొంగతనాలు నిన్న లింగంపేట్, నేడు అయ్యపల్లిలో దొంగలు పడి తాళం వేసిన ఇండ్లనే టార్గెట్ చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ లు చేసిన పోలీసుల కళ్ళు కప్పి దొంగలు దొంగతనానికి పాల్పడుతున్నారు. లింగంపేట్ మండలంలోని అయ్యప్పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి సల్ల దేవయ్య ఇంట్లో దొంగలుపడి బంగారి నగలు నగదు అపహరించుక వెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.మంగళవారం బంధువుల గ్రామమైన లక్ష్మాపూర్ లో బోనాలు ఉండడంతో సల్ల దేవయ్య ఇంటికి తాళం వేసి వెళ్లారు.అంతకు ముందు సోమవారం రోజున అతని భార్య సల్ల దేవవ్వ తల్లి గారి గ్రామమైన భవానిపేటకు వెళ్లారు. అదే అనువుగా చూసిన దొంగలు ఇంటి తాళం పగల గొట్టకుండా ఇంటి పైకప్పు నుండి దూకి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం సల్ల దేవయ్య అయ్యపల్లికి వచ్చి ఇంటి తాళం తీసి చూసేసరికి ఇంటి పై కప్పుకు అమర్చిన సలాకలను వంపి పెద్దింటి డోర్ తాళం పగలగొట్టి ఉండడంతో దొంగలు పడ్డారని గమనించి సల్ల దేవయ్య ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న ఐదు తులాల బంగారి అభరణాలు 50 వేల రూపాయల నగదు, 75 తులాల వెండి, అపహరించుక పోయారన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి లింగంపేట ఎస్సై చైతన్ కుమార్ రెడ్డి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీంతో వేలి ముద్రలను సేకరించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిసింది.

బాన్సువాడ లో నకిలీ ఐస్ క్రీం తయారీ.

# నకిలీ స్టికర్లతో విక్రయం

(మొదటి పేజీ తరువాయి)

కాసుల కక్కుర్తితో బాన్సువాడ మెయిన్ రోడ్ పక్కనే ఇంట్లోనే ఎలాంటి అనుమతులు లేకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా దర్జాగా ఐస్ క్రీం తయారు చేస్తూ, గల్లీ గల్లీలో అమ్మేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఐస్ క్రీం తయారికి అనుమతులు ఉన్నాయా అని **"సూర్య ప్రతినిధి"** అడగ్గా, గత నాలుగు సంవత్సరాల నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండానే ఈ దందా నడుపుతున్నట్టు ఫ్యాక్టరీ నిర్వాహకుడు చెప్పడం జరిగింది. ఫుడ్ లైసెన్స్, మున్సిపల్ అనుమతి లేకుండా విచ్చలవిడిగా ఐస్ క్రీం తయారు చేస్తూ, బ్రాండెడ్ ఐస్ క్రీం డబ్బాలు, కవర్లు నిజామాబాద్ నుండి తీస్కొని వచ్చి దాంట్లో అపరిశుభ్రమైన వాతావరణంలో, ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, హానికర విషపురితమైన కెమికల్స్ తో తయారు చేసిన ఐస్ క్రీమ్స్ ని పెట్టి అమ్మేస్తున్నారు. ఒక్కసారి ఐస్ క్రీం కవర్ పై గమనిస్తే తయారు చేసిన తేదీ, బ్యాచ్ నెంబర్, ఎక్స్పైరీ తేదీ, తయారు చేసిన చిరునామా ఏమి కూడా ఉండదు. ఇలాంటి నకిలీ ఐస్ క్రీం దందాలు బాన్సువాడలోనే కాదు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా ఉన్నాయి. ఏళ్ల తరబడి సాగుతున్న వ్యాపారం అధికారులకు కనిపించడం లేదా? గుట్టు చప్పుడు కాకుండా జరుగుతుందా? లేదా గుట్టు తెలిసిన మామూళ్ల మత్తులో జోగుతున్నారా? అన్న ప్రశ్నలు తలేత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

## సింగీతం అటవీ ప్రాంతంలో అస్తిపంజరం లభ్యం



**నిజాంసాగర్, మే 29, సూర్య మేజర్ న్యూస్ :** నిజాంసాగర్ మండలం సింగీతం అటవీ ప్రాంతంలో మంగళవారం అస్తిపంజరం లభించింది. వివరాల ప్రకారం.. నిజాం సాగర్ మండలం తుంకిపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి రవీందర్ గా గుర్తించినట్లు సిఐ కృష్ణ తెలిపారు. అస్తిపంజరం వద్ద మద్యం బాటిళ్లు, విషం బాటిల్, వాటర్ బాటిల్ లభ్యమైందని అన్నారు. మృతుని భార్య వదిలి వెళ్లిపోవడంతో, పిల్లలను పోషించలేక విక్రయించాడని, ఎవరూ లేకపోవడంతో జులాయిగా తిరుగుతుండేవాడని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## మంజీరా నదిలో పడి ఇద్దరు మృతి





**బాన్సువాడ, మే 29, సూర్య మేజర్ న్యూస్ :** బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండలం మంజీరా నదిలో స్నానానికి వెళ్లిన ఇద్దరు గల్లంతైన ఘటన బుధవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. బీర్కూర్ కు చెందిన కటికే పందరి(30), టిల్లు(12) స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపటికి పందరి, టిల్లు మృతదేహాలు బయటకు తీశారు. కాగా మంజీరా నదిలో ఇష్టం వచ్చినట్లు ఇసుక తవ్వకాలు చేపట్టడంతో గోతుల్లో నీరు చేరి లోతు తెలియక ప్రాణాలు పోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ధాన్యాన్ని త్వరగా దించుకోవాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్

**సదాశివనగర్, మే 29, సూర్య మేజర్ న్యూస్ :** రైస్ మిల్లులలో లారీలు గంటలకొద్దీ వేచి ఉండకుండా త్వరగా ధాన్యం దించుకోవాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం సదాశివనగర్ మండలంలో పలు రైస్ మిల్లులను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు తో కలిసి కొనుగోళ్ల ప్రక్రియ, లోడింగ్, అన్ లోడింగ్ ను పరిశీలించి ఎట్టి పరిస్థితులలో మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని ఏ రోజుకారోజు దించుకోవాలని, లారీలను వెయిటింగ్ లో పెట్టుకోరాదన్నారు. సదాశివనగర్ లోని బాలాజీ రైస్ మిల్, పద్మావతి రైస్ మిల్, భవాని పల్లిలోని శ్రీ లక్ష్మి ఆగ్రో రైస్ మిల్, అడ్లూర్ యెల్లారెడ్డి లోని శ్రీ సాయి రైస్ మిల్లులను సందర్శించి స్థలా భావాలేమి వల్ల ఆరుబయట ధాన్యం దించుకోవడాన్ని అభినందిస్తూ త్వరగా అన్ లోడింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం అడ్లూర్ యెల్లారెడ్డి లోని కేంద్రాలను సందర్శించి, తూకం వేసి ఉన్న సంచులను త్వరగా లోడింగ్ చేసి పంపాలని, కల్లాలలో ఉన్న ధాన్యాన్ని తూకంవేయాలని అన్నారు. కుప్రియాల్ కేంద్రం పరిధిలో రైతులు గత రాత్రి ధాన్యం తీసుకురాగా ప్రమాణాల మేరకు కొనుగోలు చేయాలన్నారు. ఇంకా ఈ కేంద్రం పరిధిలో ఆరు ఎకరాల మేర ధాన్యం కోయ వలసి ఉందని, అట్టి ధాన్యాన్ని కూడా పూర్తిగా సేకరిస్తామన్నారు. బుధవారం 88 లారీలు సమకూర్చి 2,120 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించామన్నారు. 327 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇంకా 23 కేంద్రాలు మాత్రమే మిగిలిఉన్నాయని చంద్రమోహన్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 53,438 మంది రైతుల నుండి రూ.679 కోట్ల విలువల 3,03,580 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 623 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు.



## జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన వేద స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు

**బిక్కనూర్, మే 29, సూర్య మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలలో వేదా స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. 100 మీటర్ల పరుగు పందెంలో 16 సంవత్సరాల బాలికల విభాగంలో శ్రీనిధి రెండవ బహుమతిని మరియు 14 సంవత్సరాల బాలుర విభాగంలో గూడూరి శ్రీజిత్ మూడో బహుమతి సాధించారు. వీరికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, సెక్రెటరీ అనిల్ కుమార్ లు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వేద స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్లు దాసరి నాగరాజు,సలీంలు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులను తయారుచేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు



## పొట్టకూటి కోసం మండు టెండలో ఉపాధి పనులు



**లింగంపేట్, మే 29, సూర్య మేజర్ న్యూస్ :** మండు టెండలో ఇంటి నుండి బయటకు వెళ్లాలన్న భానుడి ప్రతాపానికి కాళ్లు బయట పెట్టాలేని పరిస్థితిఉన్న ఒళ్లంతా మంటలు మండే ఎండ వేడిలో పొట్టకూటి కోసం మండు టెండల్ని లెక్క చేయకుండా ఉపాధి హామీ పనుల్లో కూలీలు పాల్గొంటున్నారు. లింగంపేట్ మండలంలోని పొల్కంపేట్ గ్రామంలో మండు టెండలో గ్రామ ప్రజలు ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఉపాధి హామీ పనుల్లో బాగంగా బుదవారం గ్రామంలోని చౌదరి చెరువులో పూడికతీత పనుల్లో 400 మంది కూలీలు పనులు చేపట్టగా,చిలమంతుల శాంత వ్యవసాయ పొలంలో ఫాంఫండ్స్ 100 మంది కూలీలు పనులు చేసారు. ఈ ఉపాధి హామీ పనులు 500 మంది కూలీలు క్షేత్ర సహాయకులు మర్రి వెంకటేశం పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన వాస్తు పారాయణ కార్యక్రమం

**బిక్కనూర్, మే 29, సూర్య మేజర్ న్యూస్:**
మండల కేంద్ర శివారులోని దక్షిణ కాశీగా పిలవబడే శ్రీ సిద్ధిరామేశ్వర ఆలయంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వాస్తు హెూమ కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. కాగా చివరి రోజు ఆలయ ఆవరణలో కుంభాభిషేకం, స్వామివారికి నవ కలశ అభిషేకం తదితర కార్యక్రమాలను ఉడిపి నుండి వచ్చిన వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పెద్ద బచ్చాగారి రామ్ రెడ్డి మాట్లాడుతూ లోక కళ్యానార్థం తొమ్మిది రోజులపాటు వాస్తు పారాయణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులకు, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అందె మహేందర్ రెడ్డి, నాయకులు మహిపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, రేఖ సుదర్శన్, తాటిపాముల లింబాద్రి, గంగాల భూమయ్య, తునికి వేణు, ఉప్పరి సాయిలు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అల్ఫ్రాజోలం అక్రమంగా తరలిస్తున్న ముఠా అరెస్ట్

**గాంధారి, మే 29, సూర్య మేజర్ న్యూస్ :**
కల్తీ కల్లు తయారీకి వాడే ఆల్ఫాజోలం సరఫరా చేసే ముఠాను ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం నుండి బుధవారం సాయంత్రం వరకు డిప్యూటీ కమీషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు గాంధారి మండలంలో ఎక్సైజ్ అధికారులు సోదాలు చేపట్టారు.. ముఖ్యంగా కల్లు లో కలిపే మత్తు పదార్థం ఆల్ఫాజోలం సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు.. ఇందులో శేఖర్ గౌడ్, బైరాగౌడ్, ప్రసాద్ గౌడ్ ల వద్ద ఆల్ఫాజోలం పదార్థం గుర్తించి వారిని అదుపులో తీసుకున్నామని వారు తెలిపారు.వారి వద్ద నుండి 1.25 కిలోల ఆల్ఫాజోలం, మూడు సెల్లఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు



కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏఇఎస్ చంద్రబాను నాయక్, సీఐ స్వప్న, వెంకటేష్, ఎస్ఐ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు చేసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తరలించాలి



**బిక్కనూర్ మే 29 సూర్యా మేజర్ న్యూస్:'**
కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా సేకరించి వెంటనే మిల్లులకు తరలించాలని, పౌర సరఫరాల ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం కేంద్ర నిర్వాహకులను, మిల్లర్లను ఆదేశించారు. బుధవారం బిక్కనూర్ మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలన్నారు అనంతరం బస్వాపూర్ గ్రామ శివారులో ఉన్నవిజయ గణపతి రైస్ మిల్, పూర్ణిమ రైస్ మిల్, సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులను డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మార్చి 26 న 350 కేంద్రాల ద్వారా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించగా 327 కేంద్రాలలో పూర్తయిందని, ఇంకా 27 కేంద్రాలలో ధాన్యం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ ప్రతి రోజు మిల్లర్లు, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు, కేంద్రాల నిర్వహకులతో సమీక్షిస్తూ త్వరితగతిన ధాన్యం సేకరణ పూర్తయ్యేలా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మానిటరింగ్ చేస్తున్నారని అన్నారు. సేకరించిన ధాన్యానికి 92 శాతం మేర 623 కోట్లు రైతుల ఖాతాలో డబ్బులు జమచేశామన్నారు.



## నాగిరెడ్డిపేట్ బారాస వైస్ ఎంపీపీ గా వినీత దుర్గా రెడ్డి.

## కాంగ్రెస్ కు కోలుకోలేని పొలిటికల్ దెబ్బ.

**ఎల్లారెడ్డి (నాగిరెడ్డిపేట్), 29 మే, సూర్య మేజర్ న్యూస్ :**
నాగిరెడ్డిపేట్ వైస్ ఎంపీపీ గా పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత ఎంపికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరస్వామి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వైయస్ ఎంపీపీ పదవి కి ఎన్నిక నిర్వహించారు. ఇదివరకు వైస్ ఎంపీపీ గా ఉన్న దివిటీ రాజ్ దాస్ పై బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినారు. దీంతో ప్రభుత్వం వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది దీంతో బుధవారం వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ నుండి బొల్లారం ఎంపీటీసీ ఓర లావణ్య పోటీ పడగా టిఆర్ఎస్ పార్టీ నుండి పోచారం ఎంపీటీసీ టేకులపల్లి వినీత పోటీగా నిలబడ్డారు. ఈ భిన్నంలో ఓర లావణ్య కు ముగ్గురు ఎంపిటిసిలు చేతులు లేపి తమ మద్దతును ప్రకటించగా టేకులపల్లి వినీతకు ఆరుగురు ఎంపిటిసిలు చేతులు లేపి మద్దతు తెలిపారు. దీంతో పోచారం ఎంపిటిసి టేకులపల్లి వినీత దుర్గా రెడ్డి వైస్ ఎంపీపీ గా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరస్వామి ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపిటిసి వినీత దుర్గారెడ్డి ఎన్నిక కావడంతో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. వైస్ ఎంపీపీ గా ఎన్నికైన వినీత దుర్గారెడ్డి







కి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జజల సురేందర్ తోపాటు స్థానిక జడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి, ఎంపిటిసిలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పర్బన్న, సీనియర్ అసిస్టెంట్ వెంకట్ రాంరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన ఆకుల పాపయ్య కుటుంబాన్ని పరామర్శించిన

## మాజీ ఎమ్మెల్యే జాజాల..!

**ఎల్లారెడ్డి (గాంధారి),29 మే ,సూర్య మేజర్ న్యూస్**
గాంధారి మండల కేంద్రానికి చెందిన ఆకుల లక్ష్మణ్ తండ్రి ఆకుల భూమయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్య రీత్యా మరణించారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న బారాస మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బుధవారం గాంధారి మండలానికి చేరుకొని, వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆకుల పాపయ్యతో ఉన్న సాహిత్యం వారి కుటుంబంతో ఉన్న ప్రేమాభిమానాలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం భారత పార్టీ నుంచి ధనవంతు సహాయ సహకారాలు ఉంటాయని వారి కుటుంబానికి తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట వెంట మండల



నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, రెడ్డి రాజులు, మండల కోఆప్షన్ ముస్తఫా, టౌన్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సురేష్, సొసైటీ డైరెక్టర్ సాయిలు, ఎండి గౌస్, శ్రీనివాస్ నాయక్ తదితరులు ఉన్నారు

# నత్త నడకన సాగునీటి పథకాలు



**కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, మే 29 :**
రైతు సంఘానికి సాగునీరు అందించడం లక్ష్యంగా కాళేశ్వరం ప్యాకేజ్ 22 పనులు తో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకాలకు గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఎత్తిపోతల పథకాలకు అరకొర నిధులు వస్తుండడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ ఎత్తిపోతల పథకాలకు నిధులు విడుదలలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తుండడంతో భూసేకరణ జరగడం లేదు. జిల్లాకు గోదావరి జలాలను తీసుకు రావడంలో ప్యాకేజీ 22 పనులు కాంట్రాక్టర్లు నిలిపి వేసినట్లు తెలుస్తోంది. కాలువల తవ్వకాలతో పాటు ఇతరత్రా పనులు చేపట్టడానికి అవసరమైన భూ సేకరణ నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ప్యాకేజీ 22 తో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటేనే సాగునీటి పథకాలకు మోక్షం లభించనుంది.

**ముందుకు కదలని కాళేశ్వరం పనులు :**

కామారెడ్డి, మెదక్ జిల్లాలోని బీడు భూములను సాగు భూములుగా మార్చేందుకు చేపట్టిన ప్రణాహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 22వ ప్యాకేజీ పనులు కాళేశ్వరం ప్రాజెక్టు మోక్షం లభించింది. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు జిల్లాలకు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు సాగునీరు అందించే విధంగా గత ప్రభుత్వం డిజైన్ చేసింది. ఈ 22వ ప్యాకేజ్ పనులకు కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్, భొంపల్లి రిజర్వాయర్ ప్రధానమయింది. ఇందుకు సంబంధించి కాల్వలో తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. భూసేకరణకు నిధులు రాకపోవడంతో అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా ఈ పథకం పనులు ఉన్నాయి. దీనికి తోడు ఈ ప్యాకేజీ పనులు జరిగినప్పటికీ పనులు సంబంధించిన బిల్లులు సకాలంలో మంజూరు కావడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ ప్యాకేజీ పనులు అంచనా వ్యయం 1446 కోట్ల రూపాయలు మొత్తం 44 22 ఎకరాలలో భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు 1244 ఎకరాలు మాత్రమే భూసేకరణ చేపట్టారు.

**ప్యాకేజీ పనులు తీరు ఇలా:**

కామారెడ్డి, మెదక్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు 22వ ప్యాకేజీ పనులు జిల్లాలో చేపట్టారు. సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్ నుంచి 100.80 కాల్వలు కావాల్సి ఉంది. ఇందులో ఎడమ కాలువల్లో 501 కిలోమీటర్లు కుడికాలువ 11 కిలోమీటర్లు ప్రధాన కాలువ 14 కిలోమీటర్స్ తవ్వాల్సి ఉంది ప్రధాన కాలువ దాదాపు పనులు పూర్తయ్యాయి కుడి కాలువ పనులు తుది దశకు చేరుకుంది ఎడమ కాలువకు సంబంధించి భూసేకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఈ కాలువతో పాటు నిజాంబాద్ జిల్లాలోని ప్యాకేజీ నుంచి సొరంగం ద్వారా భూపతి రిజర్వాయర్ వరకు 75 60 కిలోమీటర్ల వరకు కాల్వ నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అప్రోచ్ కాలువల తవ్వకం మాత్రమే పూర్తయింది.

**బిల్లుల చెల్లింపులు జాప్యం :**

కాళేశ్వరం జలాలను కామారెడ్డి, మెదక్ జిల్లాలకు నీరు అందించేందుకు ప్యాకేజ్ 20 21 22 కింద పనులు చేపడుతున్నారు. జిల్లాకు గోదావరి జలాలు తరలించేందుకు ప్రారంభించిన 22వ ప్యాకేజీ పనులు పూర్తి కాలేదు. కాల్వల తవ్వకాలతో పాటు ఇతర పనులు పూర్తి కాలేదు పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 124 4ఎకరాలలో మాత్రమే భూసేకరణ చేపట్టారు. గత ప్రభుత్వం నుంచి మొదలుకొని ఇప్పటివరకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపివేశారు. దీంతో కాళేశ్వరం పనులు ముందుకు సాగడం లేదు

## ఎల్లారెడ్డి వాసి వైద్యానికి ఆర్థిక సాయం చేసిన సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్



ఎల్లారెడ్డి, 29 మే, సూర్య మేజర్ న్యూస్ :
ఎల్లారెడ్డి వాసికి ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో గత కొన్ని నెలలుగా హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ మత్త మాల ప్రశాంత్ గౌడ్ మిత్రులతో కలిసి బుధవారం హైదరాబాద్ కు వెళ్లి చికిత్సలు పొందుతున్న పాతకుల మహేష్ గౌడ్ ను కలిసి అతనికి 25 వేల రూపాయల డబ్బును అందజేశారు అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు మెరుగైన చికిత్సల కొరకు ఎమ్మెల్యే మదన్మోహన్ రావు తో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్సలు అందజేసె విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు, ఆర్థికపరంగా కూడా ఆదుకోవాలని ఎమ్మెల్యే గారిని కోరుతామని పేర్కొన్నారు, పాతకుల మహేష్ గౌడ్ కు వారి కుటుంబ సభ్యులకు , ధైర్యం చెప్పారు ,ఆయన వెంట అతని మిత్రులు సంతోష్ , కుమార్, ఆనీల్ తదితరులు ఉన్నారు

## కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం..!

**స్పెషల్ ఆఫీసర్ సుశీల**

**ఎల్లారెడ్డి,మే29 సూర్య మేజర్ న్యూస్**
ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాల లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా పాఠశాల, కళాశాల ప్రత్యేక అధికారిని సుశీల ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాల కళాశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 2024-25 కొరకు ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ గ్రూప్ లో(40) బైపిసి (40) సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రవేశాల కొరకు పదవ తరగతి పాస్ అయిన బాలికలు అర్హులని ఆమె తెలిపారు. ఉచిత భోజనంతో పాటు ఉచిత పుస్తకాలు. ఏకరూప దుస్తులు కూడా అందజేస్తామని ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన బాలికలు, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాల కొరకు కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని కస్తూర్బా గాంధీ పాఠశాల కళాశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల కోరారు

## సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ కు దరఖాస్తులు ఆహ్వానం..!

**జిల్లా సమన్వయ అధికారి కృత మూర్తి.**

**ఎల్లారెడ్డి, 29 మే, సూర్య మేజర్ న్యూస్ :**
సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నాన్, సి ఈ ఓ విద్యాలయాల్లో 2024-25 సంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్మీడియట్ లో మిగిలిపోయిన సీట్లను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి కృత మూర్తి సోమవారం. ఒక ప్రకటనలో తెలిపారు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31 వరకు గురుకుల సొసైటీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీసీ, బైపిసి, ఎం ఇ సి, సి ఈసి, హెచ్ సి, ఒకేషనల్ కోర్సులో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు దరఖాస్తు రుసుము కింద ఆన్లైన్లో 100 రూపాయలు చెల్లించాలని కోరారు.



## ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 31 వరకు గడువు...!

**ప్రిన్సిపాల్ సాయిబాబా**

**ఎల్లారెడ్డి, 29 మే, సూర్య మేజర్ న్యూస్ :**
ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు, ఎంపీసీ ,బైపిసి, సిఈ సి, ఎం ఇ సి, గ్రూపులకు గాను ఒక్కొక్క గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు అడ్మిషన్లు , కోరేవారు ఈ నెల 31 వరకు చివరి గడువు అని అన్నారు, మీసేవ కేంద్రానికి, విద్యార్థులు ఆన్లైన్ మేము తో పాటు ఆధార్ కార్డ్ ఒక ఫోటో తో వెళ్లి ఆన్లైన్ లో




డబ్ల్యూ, డబ్ల్యూ, డబ్ల్యూ, టిఎస్ మోడల్ స్కూల్ డాట్ కమ్ అనే వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.